

కమ్యూనిటీ హాల్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలి

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ శారదానగర్ కమ్యూనిటీ హాల్‌పై నిర్మిస్తున్న రెండవ అంతస్తు పనులను ఎమ్మెల్యే గురువారం పరిశీలించారు. సీనియర్ సిటిజన్స్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ కోసం కింద అంతస్థులో అదనపు వసతులు కల్పించాలన్నారు. శారదానగర్ ఫేజ్-2లో పార్క్ ఎత్తు తక్కువగా ఉండడంతో ఆ పార్కులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దాదాపు రూ.98లక్షలతో అదనపు అంతస్తు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, నాయకులు భాస్కర్ సాగర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటి సరఫరా పరిశీలన



కలుషిత నీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్ కాలనీలో కలుషిత నీటి సరఫరా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన కాలనీ ప్రతినిధులతో కలిసి కలుషిత నీటి సరఫరాను పరిశీలించారు. కాలనీలో రోడ్ నెం.3,4లలో తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్‌లో మురుగునీరు కలుస్తోందని మూడు రోజుల క్రితం జలమండలి అధికారులకు ఫిర్యాదు చేశామని కాలనీ వాసులన్నారు. జలమండలి సిబ్బంది సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని పవన్ కుమార్ ఆదేశించారు. సమస్య పరిష్కారమయ్యే వరకు ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు బీవీ. రామిరెడ్డి, ప్రతినిధులు ఎం.రమేష్, కే.రాజశేఖర్, వినోద్‌కుమార్, సదాశివరావు పాల్గొన్నారు.

ఆదర్శ జీవితానికి రామాయణం చక్కటి మార్గం

● బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వర్‌రావు



ప్రవచనాలు చెబుతున్న కోటేశ్వర్‌రావు

సైదాబాద్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో ప్రతి ఒక్కరూ ఆదర్శంగా జీవించడానికి రామాయణం చక్కటి మార్గం చూపుతుందని బ్రహ్మశ్రీ డాక్టర్ చాగం టి కోటేశ్వర్‌రావు అన్నారు. సైదాబాద్ ఎస్‌బీహెచ్ బీ కాలనీ కోదండ రామాలయం లో మూడు రోజుల పాటు కొనసాగిన రామాయణం వైభవంపై ప్రవచనాల కార్యక్రమం గురువారం ముగిసింది. రాముడి ఔన్నత్యం, సీతమ్మతల్లి పవిత్రత, భరత, శత్రుఘ్నుల సోదర భావం గూర్చి వివరించారు. రామాయణ గ్రంథం బోధనలను ఆచరించాల్సిన ఆవశ్యకత తెలియజేశారు. తల్లిదండ్రులు బాల్యం నుంచే రామాయణం ద్వారా మానవీయ విలువలను పిల్లలకు నేర్పాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆలయ కమిటీ చైర్మన్ రావికంటి శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



కుంట్లూర్ ప్రభుత్వ పాఠశాలలో అవగాహన సదస్సులో విద్యార్థులు

వాతావరణ మార్పులపై విద్యార్థులకు అవగాహన

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): అవేక్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం పెద్దఅంబర్‌పేట్, కుంట్లూర్ ప్రభుత్వ పాఠశాలల్లో వాతావరణ మార్పులపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వాతావరణంలోని గాలి, నీరు, ధ్వని పొల్యూషన్ పై విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా ప్రతి ఇంట్లో రెండు మొక్కలను నాటాలని, ఇంకుడుగుంతలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్‌డీఎస్ కో-ఆర్డినేటర్ మోడెపు సత్యనారాయణగౌడ్, హెచ్‌ఎంలు శ్రీనివాస్‌రావు, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకుడు విజయ్‌నేత

చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

వనస్థలిపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో బాటసారుల దాహార్తిని తీర్చడానికి ఏర్పాటు చేసే చలివేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు, సామాజిక వేత్త గద్దె విజయ్‌నేత అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తాలోని ఆటోస్టాండ్‌లో గంగరాజు వెంకటచలపతిరావు జ్ఞాపకార్థం గద్దె విజయ్‌నేత చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సెన్సార్ బోర్డు డైరెక్టర్ కృష్ణదాస్, సెన్సార్ బోర్డు పి.కృష్ణాదిశేషు, వీ.వీ చౌదరి, పాండు నేత, హస్తినాపురం డివిజన్ టీడీపీ అధ్యక్షుడు గిరియాదవ్, పద్మక్క, శేఖర్‌నేత, జిమ్ రాజు, మధు పాల్గొన్నారు.

సేవ చేయడం కర్తవ్యంగా భావించాలి: దేశ్‌పాండే

సైదాబాద్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సేవ చేయడం అంటే జాలి, దయ చూపడం, ముష్టివేయడం కాదని, సేవ అనేది కర్తవ్యంగా భావించాలని విశ్వహిందూ పరిషత్ కేంద్రీయ సహ సంఘటన కార్యదర్శి వినాయకరావు దేశ్‌పాండే అన్నారు. గురువారం ఐఎస్‌సదన్ డివిజన్ కృష్ణానగర్‌లోని కరుణశ్రీ సేవాసమితి 25వ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆశ్రమ భవనం మూడో అంతస్తు, పెంట్‌హౌస్, సోలార్ ప్రాజెక్టును ఆయన ప్రారంభించారు. తమ రక్తసంబంధీకులకు ఆపద సమయంలో ఏవిధంగా అండగా నిలిచి సేవ చేస్తామో, అదేవిధంగా దీనుల విషయంలో అదే ప్రేమ చూపాలని తెలిపారు. కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షుడు కడారి సత్యమూర్తి, భాగ్యనగర్ క్షేత్ర సంఘటన కార్యదర్శి సత్యం, రాష్ట్ర అధ్యక్షుడు నరసింహమూర్తి, కార్యదర్శి పండరీనాథ్, క్షేత్ర సేవ ప్రముఖ్ రమేష్, రాజేందర్‌రెడ్డి, సమితి కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి

● హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య!

ఆదిభట్ల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఓ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్‌లో గురువారం జరిగింది. బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల(కందుకూరు)లో డి.వివేక్(14) తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. గురువారం హాస్టల్ గదిలో టవల్‌తో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించి కేసు నమోదు చేశామని ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు.

సింగరేణి వాంబే కాలనీవాసుల

గోస తీరేదెన్నడో..?

అస్తవ్యస్త పారిశుధ్యం

● రోడ్లపై పారుతున్న మురుగునీరు
● పట్టించుకోని అధికారులు
● ఆందోళనలో ప్రజలు



సింగరేణి వాంబేకాలనీ గృహసముదాయం



వాంబేకాలనీలో రోడ్లపై పారుతున్న మురుగునీరు



గృహాల మధ్య కుళ్లిన వ్యర్థాలు

సైదాబాద్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సింగరేణి వాంబే కాలనీవాసులంతా కూలీ, నాలీ చేసుకుని బతికే పేద ప్రజలు. దీంతో ఈ బస్తీవాసులంటే అధికారులకు చిన్న చూపు. దీంతో వారు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. రోడ్లపై పొంగిపొర్లే మురుగునీటితో సహవాసం, ఇళ్ల మధ్య చెత్తకుప్పలు కుళ్లిపోయి దుర్వాసన, దుర్గంధం వెదజల్లుతుండటం వంటి ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. పరిసరాల అపరిశుభ్రతతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ వాంబే కాలనీలో 1700లకు పైగా గృహాలు ఉన్నాయి. ఈ కాలనీలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. చెత్తకుప్పలు పేరుకుపోకుండా చూడాల్సిన పారిశుధ్య సిబ్బంది, సంబంధిత అధికారులు దానిని పట్టించుకోకపోవడంతో వాంబేకాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్తకుప్పలను తొలగించడంలో మహానగరపాలక సంస్థ పారిశుధ్య విభాగం పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్యం సరిగా లేకపోవడంతో దోమలు, క్రిమికీటకాలు స్వైరవిహారం చేస్తూ ప్రజలను రోగాల బారిన పడేస్తున్నాయి. దీనికితోడు నెల రోజులుగా డ్రైనేజీలు నిండిపోయి మురుగునీరు కాలనీ రోడ్లపై పారుతుండటంతో పరిసరాలు దుర్గంధంగా మారాయి. వాంబేకాలనీలలో అపరిశుభ్రతతో ప్రబలే వ్యాధులు ఎవరిని బలిగొంటయోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రజల ఆరోగ్యంపై అధికారులు పెద్దగా పట్టించుకోవడటం లేదని విమర్శలు వస్తున్నాయి.

ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు



నెల రోజులుగా డ్రైనేజీలు నిండి రోడ్లపై మురుగునీరు పారుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కానీ సమస్యను పరిష్కరించేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. రహదారులపైనే మురుగు పారుతోంది. పిల్లలు తరుచూ అనారోగ్యం పాలవుతున్నారు.

- భరత్, వాంబేకాలనీ

ఉన్నతాధికారులు స్పందించాలి



ఒక పక్క ఇళ్ల మధ్యలో పేరుకుపోయిన చెత్తకుప్పలు, మరో పక్క పారుతున్న మురుగునీరుతో దుర్భరమైన పరిస్థితి ఉంది. గత్యంతరం లేక ప్రజలు నానా అవస్థలు పడుతూ జీవిస్తున్నారు. ప్రజల బాధలను ఎన్నిమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా స్పందన లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

- శంకర్‌నాయక్, గిరిజన సంఘం నాయకుడు

పోలింగ్ విధులపై శిక్షణ

● 178 మంది పోలింగ్ సిబ్బంది, 12మంది మైక్రో అబ్జర్వర్లు గైర్హాజరు



పోలింగ్ సిబ్బందికి శిక్షణనిస్తున్న నోడల్ అధికారి యుగెందర్‌రెడ్డి

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంలో పోలింగ్ విధులను నిర్వహించబోయే పోలింగ్ సిబ్బందికి, మైక్రో అబ్జర్వర్లకు గురువారం మలక్‌పేటలోని ముంతాజ్ కళాశాలలో శిక్షణనిచ్చారు. ఏఆర్‌వోలు రాజేష్‌కుమార్, జయశ్రీల పర్యవేక్షణలో జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో 178 మంది పోలింగ్ సిబ్బంది గైర్హాజరయ్యారని నోడల్ ఆఫీసర్ యుగేందర్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా 12 మంది మైక్రో అబ్జర్వర్లు కూడా శిక్షణకు హాజరు కాలేదని నివేదికను రూపొందించి జిల్లా కలెక్టర్, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టికి పంపనున్నట్లు ఆయన వివరించారు. గురువారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరిగిన మొదటి విడత శిక్షణ కార్యక్రమంలో 375 మంది పోలింగ్ సిబ్బందికి గాను 299 మంది హాజరయ్యారు. 76 మంది సిబ్బంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగిన శిక్షణలో 375 మందికి గాను 273 మంది హాజరయ్యారు. 102 మంది సిబ్బంది గైర్హాజరయ్యారు. ఈ రెండు విడతల్లో కలిపి 178 మంది పోలింగ్ సిబ్బంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా మొదటి విడత మైక్రో అబ్జర్వర్ల శిక్షణలో 32 మందికి గాను 30 మంది హాజరు కాగా, రెండో విడతలో 32మందికి గాను 22 మంది హాజరయ్యారు. ఈ రెండు విడతల్లో కలిపి 12మంది మైక్రో అబ్జర్వర్లు శిక్షణకు గైర్హాజరయ్యారని నివేదికను రూపొందించారు.

అయ్యప్పస్వామి ఆలయంలో ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



ఆశీర్వచనం తీసుకుంటున్న డీసీసీబీ చైర్మన్ సత్తయ్య తదితరులు

హయత్‌నగర్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్‌లో హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా గురువారం ఉదయం కాలపూజ, యంత్రప్రతిష్ఠ అనంతరం నూతన అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ వేదమూర్తులు లోక శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో పార్వతీపరమేశ్వర, రమా సహిత సత్యనారాయణస్వామి శాంతి కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కొత్తకురుమ సత్తయ్య, తుర్కయంజాల్ మున్సిపల్ కౌన్సిలర్ కోషిక ఐలయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయానికి కౌన్సిలర్ రూ. 2లక్షల విరాళం

హయత్‌నగర్: తుర్కయంజాల్‌లోని హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయానికి మున్సిపాలిటీ 22వ వార్డు కౌన్సిలర్, ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్య రూ.2లక్షల 116 విరాళం అందజేశారు. గురువారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని త్రిదండి అస్త్రాకరి సంపత్ కుమార రామానుజ జీయర్, కళ్యాణవెంకటేశ్వర్ల పండితులు హనుమాన్ దీక్షితులు చేతుల మీదుగా విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు తీర్థ ప్రసాదములు అందజేశారు.

అలైన్‌మెంట్ మార్చేవరకు స్టీల్ బ్రిడ్జి పనులు చేపట్టవద్దు



సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు, బీజేపీ నేతలు

సైదాబాద్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ ప్రధాన రహదారిపై పురాతన హనుమాన్ ఆలయం వద్ద నిర్మిస్తున్న వివాదస్పద స్టీల్ బ్రిడ్జి నిర్మాణం అలైన్‌మెంట్ మార్చే వరకు నిర్మాణ పనులు చేపట్టవద్దంటూ ఆలయ కమిటీ సభ్యులు, బీజేపీ నేతలు అధికారులను డిమాండ్ చేశారు. గురువారం సైదాబాద్ హనుమాన్ ఆలయంలో ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్ఈ) దత్తుపంత్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ, ప్రాజెక్టు అధికారులు, కాంట్రాక్టర్, ఆలయ కమిటీ సభ్యులు, బీజేపీ నేతలతో కలిసి సమావేశం నిర్వహించారు. అధికారికంగా అలైన్‌మెంట్ మార్పుపై నిర్ణయం తీసుకునే వరకు నిర్మాణ పనులు ఆపివేయాలని నేతలు కోరారు. వారం రోజుల్లో చర్యలు తీసుకుంటామని ఎస్ఈ హామీ ఇచ్చారు. సమావేశంలో నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు వినయ్ కిషోర్‌యాదవ్, బర్ల శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.



చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గురువారం నియోజకవర్గం పరిధిలోని కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులను కలిసి మద్దతు కోరారు. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో పాటు మాజీ కార్పొరేటర్ అనితాదయాకర్, సుదర్శన్‌ముదిరాజ్, రాఘవేంద్రగుప్తా, మాజీ జడ్పీటీసీ జిల్లెల నరేందర్‌రెడ్డి, బేర బాలకిషన్, పాండుగౌడ్ తదితరులను కలిసిన రంజిత్‌రెడ్డి గతంలో మాదిరిగానే ఈ సారి కూడా తనకు మద్దతుగా నిలిచి గెలిపించాలని కోరారు. - ఎల్‌బీనగర్, ఆంధ్రజ్యోతి



మీడియాతో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

మల్కాజిగిరిలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు డిపాజిట్ దక్కదు
పార్టీ ఫిరాయింపులపై ఊసరవెల్లిలా రేవంత్‌రెడ్డి : ఈటల

సికింద్రాబాద్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు మల్కాజిగిరి లోక్‌సభ సెగ్మెంట్‌లో డిపాజిట్ కూడా దక్కదని మాజీమంత్రి, బీజేపీ మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. పార్టీ ఫిరాయింపులపై సీఎం రేవంత్‌రెడ్డి ఊసరవెల్లిలా మాట్లాడుతున్నారని ఆయన ఆరోపించారు. తాడ్‌బండ్‌లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు సాద కేశవరెడ్డి కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో తలసాని శ్రీనివాస్‌యాదవ్ టీడీపీ నుంచి గెలిచి, బీఆర్ఎస్‌లో చేరినప్పుడు తీవ్రవిమర్శలు చేసిన రేవంత్‌రెడ్డి.. ప్రస్తుతం దానం నాగేందర్‌కు సికింద్రాబాద్ ఎంపీ టికెట్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. కడియం శ్రీహరి దళితుడు కాదని, పద్మశాలీ అంటూ గతంలో కామెంట్లు చేసిన రేవంత్‌రెడ్డి తాజాగా ఆయన కుమార్తె కడియం కావ్యకు ఎస్సీ నియోజకవర్గం నుంచి ఎంపీ టిక్కెట్ ఎలా కేటాయించారని ప్రశ్నించారు. సచ్చే వయస్సులో హస్తం గూటిని వీడి, బీఆర్ఎస్‌లో ఎలా చేరావంటూ పొన్నాల లక్ష్మయ్యను నిందించిన విషయాన్ని మరిచిపోయి, కేశవరావును కాంగ్రెస్‌లో ఎలా చేర్చుకున్నారు? అంటూ రేవంత్‌రెడ్డిని ఆయన ప్రశ్నించారు. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం రేవంత్‌రెడ్డి జాగీరు కాదన్నారు. స్థానిక ఎంపీగా మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టని రేవంత్‌రెడ్డికి, ఆయన పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఈటల అన్నారు. మరోవైపు మల్కాజిగిరిలోని అన్నివర్గాల ప్రజలు బీజేపీని, తనను ఆదరిస్తున్నారని, మోదీని మూడోసారి ప్రధానిగా చూడాలని ఉవ్విళ్లూరుతున్నారని అన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌తోపాటు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రజలు ఈ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. రమేష్, కేశవరెడ్డి, సుస్మిత, నాగేష్ పాల్గొన్నారు.

యాచకురాలి మృతదేహం లభ్యం

కొత్తపేట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధిలోని కామినేని చౌరస్తాలో యాచకురాలు అరుణ (40) మృతదేహం లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. బుధవారం రాత్రి 11.20 గంటలకు పెట్రోలింగ్‌లో భాగంగా బ్లూ కోల్ట్స్ పోలీసులు కామినేని వద్దకు చేరుకున్నారు. అదే సమయంలో కామినేని చౌరస్తాలో ఓ మహిళ మృతదేహం చుట్టూ జనం గుమిగూడి చూస్తున్నారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. యాచకురాలు అరుణగా గుర్తించారు. కొంత కాలంగా అరుణ, కుమార్తె శివాని(09)తో కలిసి కామినేని ఫ్లై ఓవర్ కింద తలదాచుకుంటూ బిక్షాటన చేస్తుంది. ఆమె కుడికాలికి బ్యాండేజీ ఉంది, తాజాగా ఆమె తలకు గాయమైంది. ఇటీవలే ఆమె ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స తీసుకుంది. అనారోగ్యంతో ఆమె మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతురాలి కుమార్తె శివానిని రెస్క్యూ హోంకు పంపించారు.

చెరువులో పడి యువకుడి మృతి

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 4 : చేపలు పట్టడానికి వెళ్లి ఓ యువకుడు చెరువులో పడి మృతిచెందిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట్‌కు చెందిన మహ్మద్ గౌస్ పాషా అతని భార్య, కుమారుడు మహ్మద్ అర్బాజ్ అలీ(20) కలిసి ఈ నెల 2న ఘట్‌కేసర్ మండలం, అవుషాపూర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేయడానికి వెళ్లారు. ప్రార్థనలు ముగిసిన తరువాత అర్బాజ్‌అలీ తల్లిదండ్రులకు చెప్పకుండ అక్కడి నుంచి ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులో చేపలు పట్టడానికి వెళ్లాడు. తల్లిదండ్రులు అర్బాజ్ కోసం ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా గురువారం మధ్యాహ్నం గొర్రెలకాపరి చెరువులో మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు చెరువులోని మృతదేహాన్ని బయటకు తీసి గౌస్ పాషాకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జీవ వైవిధ్యాన్ని కాపాడుకుంటేనే మానవ మనుగడ

● జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ శ్రీనివాస్



నీళ్ల తొట్లను పంపిణీ చేస్తున్న భావన శ్రీనివాస్

వనస్థలిపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జీవ వైవిధ్యాన్ని కాపాడుకుంటేనే మానవ మనుగడ ఉంటుందని జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ అన్నారు. జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ జంతువుల నీళ్ల తొట్లను బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ గాయిత్రినగర్ బ్యాంక్ కాలనీలోని మొదటి ముద్ద వద్ద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భావన శ్రీనివాస్ మాట్లాడుతూ భూమిపై ఉన్న 84లక్షల జీవరాశులు భగవంతుని సృష్టిలో భాగమేనన్నారు. విశ్వాసానికి మారుపేరు అయిన కుక్కలను పోషించుకుని కాపాడుకునే బాధ్యత మనదే అన్నారు. కుక్కలకు సమయానికి ఆహారం, నీళ్లు అందిస్తే అవి విశ్వాసంతో మన ఇంటిల్లిపాదిని కాపాడుతుందన్నారు. నేరాలను ఛేదించడంలో పోలీసులకు కుక్కలు పోషిస్తున్న పాత్ర ఎంతో గొప్పదన్నారు. ఇటీవల కుక్కలు మనుషుల మీద దాడి చేయడానికి కారణం వాటికి సమయానికి ఆహారం, నీరు దొరకకపోవడమే అన్నారు. జంతు ప్రేమికులు తప్పని సరిగా భూమిపై ఉన్న జీవరాశుల పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండి వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైన ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీలత, మమత రమేష్, టి.వాణి, కాలనీ అధ్యక్షులు రిక్కల గోపాల్‌రెడ్డి, గౌరిశెట్టి మనోజ్‌కుమార్, శ్రీరాములుగౌడ్, దయాకర్ ముదిరాజ్, వెంకట్‌రెడ్డి, సూర్యకుమారి, రుక్మిణి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కిమ్స్‌లో అరుదైన చికిత్స

● 16ఏళ్ల యువతికి మూడు వాల్వ్‌లు మార్పు



యువతితో డాక్టర్ నిసర్గ

రాయదుర్గం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో అరుదైన చికిత్స అందించారు వైద్యులు. 9గంటలపాటు శ్రమించి మీనా(16)కు గుండెలోని మూడు వాల్వ్‌లను మార్చారు. ఆస్పత్రి చీఫ్ కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ నిసర్గ వివరాలను వెల్లడించారు. మియాపూర్‌కు చెందిన 16 ఏళ్ల మీనాకు విపరీతమైన ఆయాసం, అడుగు కూడా వేయలేక ఇబ్బంది పడుతోంది. దీంతో కుటుంబ సభ్యులు కిమ్స్ ఆస్పత్రికి తీసుకురాగా వైద్యులు ఆమెకు పరీక్షలు నిర్వహించి గుండెలోని మూడు ప్రధాన వాల్వ్‌లు, మైట్రల్, ట్రైకుస్పిడ్, అయోటిక్ వాల్వ్‌లలో తీవ్రంగా లీకేజీ ఉందని గుర్తించారు. డాక్టర్ నిసర్గ బృందం 9గంటలపాటు శ్రమించి మూడు వాల్వ్‌లకు విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. శస్త్రచికిత్స చేసిన రెండో రోజు నుంచే ఆమె నడవడం మొదలు పెట్టింది. ఆమెకు భవిష్యత్‌లో ఇబ్బందులు లేకుండా పూర్తి ఆరోగ్యంగా ఉండేందుకు ఈ చికిత్స దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.